
సాక్షి
తూర్పుగోదావరి
గురువారం | 20 | జూలై | 2023



నైపుణ్యాభివృద్ధికి తర్ఫీదు

నవీన విద్యావిధానంలో జీవన నైపుణ్యాల శిక్షణను పాఠ్యాంశాలుగా చేర్చాలని సీఎం జగన్ మోహన్‌రెడ్డి ఓ చారిత్రక నిర్ణయం తీసుకున్నారు. 8లో▸



డెల్టాలకు నీరు విడుదల

ధవళేశ్వరం: బ్యారేజీ నుంచి బుధవారం తూర్పు డెల్టాకు 4,200, మధ్యడెల్టాకు 2,600,పశ్చిమ డెల్టాకు 6,500 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు.

బాలికపై లైంగిక దాడి యత్నం కేసులో ఐదేళ్ల జైలు



ఓ బాలికపై లైంగిక దాడికి యత్నించిన వ్యక్తికి ఐదేళ్ల కఠిన కారాగార శిక్ష విధిస్తూ న్యాయమూర్తి ఎల్.వెంకటేశ్వరరావు బుధవారం తీర్పుచెప్పారు. 8లో▸

న్యూస్‌రీల్

ఎన్డీఏలో పవన్ ఎందుకు చేరినట్టు..?

ప్రజలకు చెప్పాలని ఎంపీ భరత్ డిమాండ్



సీటీఆర్ఐ(రాజమహేంద్రవరం సిటీ): మన రాష్ట్రానికి కేంద్రం ఏం చేసిందని జనసేన అధినేత పవన్ కళ్యాణ్ ఎన్డీఏ కూటమిలో చేరారో ప్రజలకు సమాధానం చెప్పాలని ఎంపీ మార్గాని భరత్ రామ్ డిమాండు చేశారు. రాజమహేంద్రవరంలో బుధవారం ఆయన మీడియాతో మాట్లాడారు. ఎన్డీఏలో కలవడం, కలవకపోవడం పవన్ ఇష్టమన్నారు. గతంలో పాచిపోయిన లడ్డూ అంటూ తీవ్రస్థాయిలో ప్రభుత్వంపై విరుచుకుపడ్డ పవన్ ఇప్పుడు ఏపీకి కేంద్రం ఏం మేలు చేసిందని చేరారో చెప్పాలన్నారు. ప్రత్యేక హోదా, పోలవరం రివైజ్డ్ ఎస్టిమేషన్, వెనుకబడిన జిల్లాల నిధులు, ప్రత్యేక ప్యాకేజీ, కడప స్టీల్ ప్లాంట్, పోర్టులకు నిధులు , విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ లాంటి అంశాల్లో కేంద్రం ఏమీ చేయకపోయినా ఎన్డీఏలో చేరడంపై ఆయన అభిమానులకు వివరించాలన్నారు. టీడీపీ హయాంలో మంజూరు చేసిన నిధులను కూడా అప్పట్లో ఎన్డీఏతో విభేదించిన ఫలితంగా వెనక్కి తీసేసుకున్నారన్నారు. ఆ బకాయిలతో కలిసి మొత్తం రావాల్సిన నిధుల కోసం పార్లమెంటులో మిథున్ రెడ్డి, విజయసాయిరెడ్డిలతో కలిసి గట్టిగా పోరాడి సాధిస్తామన్నారు. సమావేశంలో రాజమహేంద్రవరం అర్బన్ అసెంబ్లీ నియోజకవర్గం వైఎస్సార్‌సీపీ కోఆర్డినేటర్ డాక్టర్ గూడూరి శ్రీనివాస్ ఉన్నారు.

ఎయిర్‌పోర్టుకు ఆర్టీసీ బస్సులు



విమానాశ్రయంలో వేచిఉన్న ఆర్టీసీ బస్సు

మధురపూడి: రాజమహేంద్రవరం విమానాశ్రయం ద్వారా రాకపోకలు సాగించే ప్రయాణికులకు ఆర్టీసీ బస్సులు సేవలందిస్తున్నాయి. విమానాల్లో వచ్చిన ప్రయాణికులు, వారి బంధువులకు అనుకూలంగా ఉండేలా వీటిని తిప్పుతున్నారు. విమానాశ్రయానికి ఉదయం 8.15, సాయంత్రం 5 గంటలకు మూడు సర్వీసుల విమానాలు వస్తాయి. ఆ సమయంలో అక్కడకు ఆర్టీసీ బస్సులు వచ్చేలా ఏర్పాట్లు చేశారు. విమానాశ్రయం లోపలి టెర్మినల్ భవనం వరకూ ఇవి వెళుతున్నాయి. ఈ బస్సులు గోకవరం డిపో నుంచి బయలు దేరి విమానాశ్రయానికి చేరుకుని, ప్రయాణికులతో రాజమహేంద్రవరం వస్తాయి. ప్రయాణికుల సంఖ్య పెరిగితే, వారికి అనుగుణంగా బస్సులను పెంచేందుకు ఆర్టీసీ అధికారులు అంగీకరించారు.

వైద్య విధాన పరిషత్ ఉద్యోగులకు ఫేస్ రికగ్నిషన్ హాజరు

కొవ్వూరు: ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో వైద్య విధాన పరిషత్‌లో ఉద్యోగులందరికీ రోజూ ఫేస్ రికగ్నిషన్ హాజరు తప్పని సరి చేశారు. జిల్లా ఏరియా ఆసుపత్రుల సమన్వయ అధికారి ఎన్.సనత్‌కుమారి ఈమేరకు ఆదేశించారు. బుధవారం పట్టణంలో స్థానిక సామాజిక ఆసుపత్రిలో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా సమీక్షా సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ఆమె మాట్లాడుతూ .ప్రతీ ఉద్యోగి కచ్చితంగా సమయపాలన పాటించాలన్నారు.ప్రతి ఆసుపత్రి ఉద్యోగి, ఇతర అంశాలకు సంబంధించిన లావాదేవీలు,నగదు తదితర వివరాలను అప్‌డేట్ చేయాలని సూచించారు.

సైబర్ భద్రతపై అవగాహన అవసరం



కార్యక్రమంలో పాల్గొన్న ఏఎస్పీ (అడ్మిన్) రాజశేఖర్, ఇన్‌స్పెక్టర్లు, ఎస్సైలు

రాజమహేంద్రవరం రూరల్: సైబర్ భద్రతపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని జిల్లా ఎస్పీ సీహెచ్ సుధీర్‌కుమార్‌రెడ్డి సిబ్బందికి సూచించారు. జిల్లా పోలీసు ట్రెనింగ్ సెంటర్‌లో జిల్లా ఎస్పీ ఆధ్వర్యంలో సైబర్ నేరాలపై మూడు రోజుల ట్రెనింగ్ కోర్సును అడిషనల్ ఎస్పీ (అడ్మిన్) ఎస్ఆర్ రాజశేఖర్ నిర్వహించారు. ముగింపు కార్యక్రమంలో ఎస్పీ మాట్లాడుతూ జిల్లాలోని అన్ని పోలీస్ స్టేషన్లలో సైబర్ నేరాల గురించి అవగాహన కలిగిన సిబ్బంది ఉండాలని ఉద్దేశంతో, 160 మందికి మూడు బ్యాచ్‌లుగా సైబర్ బేసిక్ ట్రెనింగ్ కోర్సు నిర్వహించామన్నారు. సైబర్ మోసాల బాధితులకు సహాయపడే విధానంపై సిబ్బందికి అవగాహన కల్పించామన్నారు.



రాజమహేంద్రవరం రైల్వే స్టేషన్

లాభాల కూత

- రూ.123 కోట్లు దాటిన రాజమహేంద్రవరం రైల్వే స్టేషన్ ఆదాయం
- విజయవాడ డివిజన్‌లో ఎన్ఎస్‌జీ-2 హోదా సొంతం
- ఎన్ఎస్‌జీ-3 స్థానంలో కాకినాడ రైల్వే స్టేషన్
- 1900లో ప్రారంభమైన రాజమహేంద్రవరం స్టేషన్ ప్రస్థానం
- ఇక్కడి నుంచి ప్రతి రోజూ 92కు పైగా రైళ్ల రాకపోకలు
- 12 వేల మందికి పైగా వివిధ ప్రాంతాలకు ప్రయాణం

సాక్షి, రాజమహేంద్రవరం: చారిత్రక నేపథ్యం ఉన్న రాజమహేంద్రవరం రైల్వే స్టేషన్ ఆదాయం వందేభారత్ ట్రెన్ తరహాలో వేగంగా దూసుకుపోతోంది. 2022–23 ఆర్థిక సంవత్సరంలో రూ.123 కోట్ల ఆదాయాన్ని ఆర్జించింది. వెరసి విజయవాడ రైల్వే డివిజన్ పరిధిలో ప్రతిష్టాత్మక ఎన్ఎస్‌జీ-2(నాన్ సబర్బన్ గ్రూప్స్) జాబితాలో చేరింది. గతేడాది 3వ స్థానంలో ఉన్న స్టేషన్ ప్రస్తుతం రెండో స్థానం కైవసం చేసుకుంది. రూ.478 కోట్ల కలెక్షన్‌తో విజయవాడ టాప్ పొజిషన్‌లో ఉండగా.. రూ.52,02,63,612 ఆదాయం ఆర్జించి కాకినాడ టౌన్ స్టేషన్ తృతీయ స్థానంలో నిలిచింది.

అ'పూర్వ' చరిత్ర

రాజమహేంద్రవరం రైల్వే స్టేషన్‌కు అ'పూర్వ' చరిత్ర ఉంది. స్టేషన్ దక్షిణమధ్య రైల్వే జోన్, విజయవాడ రైల్వే డివిజన్ పరిధిలోకి వస్తుంది. 1900లో ప్రారంభమైంది. 1980–81 మధ్యలో ఎలక్ట్రిఫికేషన్ ప్రారంభించారు. ఉమ్మడి తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లా ప్రయాణికులకు అత్యంత సౌకర్యవంతమైన ప్రదేశం. కోనసీమ, కాకినాడ, తూర్పు గోదావరి, ఏజెన్సీ తదితర జిల్లాల ప్రజలు ఈ స్టేషన్ ద్వారానే రాకపోకలు సాగిస్తుంటారు. ప్రతి రోజూ 92 రైళ్ల రాకపోకలు సాగిస్తుంటాయి. వీటిలో రోజుకు 12 వేల మంది ప్రయాణిస్తుంటారు. పండగల సీజన్‌లో ఆ సంఖ్య 15 నుంచి 16 వేలకు చేరుతుంటుంది. హౌరా – చెన్నై మెయిన్ లైన్‌లో రాజమహేంద్రవరం రైల్వే స్టేషన్ ఉండటంతో అత్యంత ప్రాధాన్యం సంతరించుకుంది.

దేశంలో ఎక్కడికైనా ప్రయాణించే వెసులుబాటు

రాజమహేంద్రవరం రైల్వే స్టేషన్ నుంచి దేశ వ్యాప్తంగా ఎక్కడికైనా ప్రయాణించే వీలుంది. ఢిల్లీ, కన్యాకుమారి, అసోం, దిబ్రూగఢ్, గుజరాత్, భావనగర్ తదితర సుదూర ప్రాంతాలకు సులువుగా ప్రయాణం చేసే అవకాశం ఉంది. దేశంలోనే అత్యధిక దూరం (4,189 కిలో మీటర్లు) నడిచే దిబ్రూగఢ్ – కన్యాకుమారి ఎక్స్‌ప్రెస్ స్టేషన్ నుంచే రాకపోకలు సాగిస్తోంది. పరిమిత స్టేజీలు ఉన్న కోరమండల్ సూపర్‌ఫాస్ట్ లాంటి ట్రెన్లకు ఇక్కడ హాల్టింగ్ ఉందంటే ఏ మేరకు ప్రాధాన్యత ఉందో అర్థం అవుతోంది.

ఆదాయం అదుర్స్

రాజమహేంద్రవరం రైల్వే స్టేషన్ ఆదాయం సూపర్‌ఫాస్ట్‌గా దూసుకుపోతోంది. 2022–23 ఆర్థిక సంవత్సరంలో విజయవాడ డివిజన్ పరిధిలో రైల్వే శాఖ వెల్లడించిన ఆదాయ గణాంకాల్లో విజయవాడ స్టేషన్ రూ.478,99,42,447తో మొదటి స్థానం దక్కించుకోగా.. రూ.123,56,72,334 కోట్లతో రాజమహేంద్రవరం ద్వితీయ స్థానంలో నిలిచి ఎన్ఎస్‌జీ-2 హోదా దక్కించుకుంది. రూ.52,02,63,612 కోట్ల ఆదాయం సమకూర్చి కాకినాడ టౌన్ స్టేషన్ ఎన్ఎస్‌జీ-3 హోదా దక్కించుకుంది.

ధవళేశ్వరం బ్యారేజీ నిర్మాణం దృష్ట్యా ప్రారంభం

ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో అత్యంత ప్రతిష్టాత్మకమైన ధవళేశ్వరం కాటన్ బ్యారేజీ నిర్మాణ సమయంలో రాజమహేంద్రవరం రైల్వే స్టేషన్ నిర్మాణానికి అంకురార్పణ జరిగింది. బ్యారేజీ నిర్మాణానికి అవసరమైన సిమెంట్, రాయి, యంత్రాలు, ఇనుము వంటి సామగ్రి తరలించేందుకు 1847 నుంచి 1852 వరకూ ఈ రైల్వే ట్రాక్ నిర్మాణం జరిగింది. ఆనకట్ట నిర్మాణం అనంతరం 1852లో రైళ్ల రాకపోకలు నిలిచిపోయాయి. తర్వాత ఈస్ట్‌కోస్ట్ స్టేషన్ పరిధిలో 1893 – 96 మధ్య 1,288 కిలో మీటర్ల మేర విజయవాడ – కటక్ మధ్య ట్రాక్ నిర్మించి రైళ్ల రాకపోకలకు అనుమతించారు. 1899లో విజయవాడ – మద్రాసుకు అనుసంధానం చేశారు. అప్పటికి గోదావరి నదిపై వంతెన లేకపోవడం ఇబ్బందిగా మారింది. 1900 సంవత్సరంలో రాజమహేంద్రవరం వద్ద హేవలాక్ బ్రిడ్జి (పాత రైలు వంతెన) నిర్మించారు. అప్పటి నుంచీ రాజమహేంద్రవరం, గోదావరి రైల్వే స్టేషన్లు నిరంతరాయ సేవలు అందిస్తున్నాయి.

హోదా ఎంపిక ఇలా..

రైల్వే శాఖలో ఎన్ఎస్‌జీ ఎంపికకు కొన్ని అంశాలను ప్రామాణికంగా తీసుకుంటారు. స్టేషన్‌లో ప్రయాణికులకు అవసరమైన అన్ని రకాల వసతులూ కల్పించాలి. స్టేషన్ ద్వారా రైళ్ల రాకపోకలు పెంచాలి. స్టేషన్ అభివృద్ధి చేపట్టాలి. ఈ క్రమంలో ప్రయాణికుల నుంచి సమకూరే ఆదాయాన్ని బట్టి ఎన్ఎస్‌జీకి ఎంపిక చేస్తారు. స్టేషన్లను నాన్ సబర్బన్ గ్రూప్స్ (ఎన్ఎస్‌జీ), సబర్బన్ గ్రూప్స్ (ఎస్‌జీ), హాల్ట్ స్టేషన్ గ్రూప్స్(హెచ్‌జీ)గా విభజిస్తారు. ఎన్ఎస్‌జీలో మళ్లీ ఆరు, ఎస్‌జీలో 3, హెచ్‌జీలో 3 విభాగాలు ఉంటాయి. వీటిలో స్టేషన్‌కు సమకూరే ఆదాయాన్ని బట్టి గ్రేడ్‌లు కేటాయిస్తారు.

హోదా వివరాలు ఇలా..

విభాగం	ఆదాయం (రూ.కోట్లలో)	ప్రయాణికులు
ఎన్ఎస్‌జీ-1	500	2 కోట్లు దాటాలి
ఎన్ఎస్‌జీ-2	100-500	1-2 కోట్లు
ఎన్ఎస్‌జీ-3	20-100	50 లక్షల నుంచి కోటి
ఎన్ఎస్‌జీ-4	10-20	20 లక్షల నుంచి 50 లక్షలు
ఎన్ఎస్‌జీ-5	కోటి-10 లక్షలు	10 లక్షల నుంచి 20 లక్షలు
ఎన్ఎస్‌జీ-6	కోటి కంటే తక్కువ	10 లక్షల లోపు

నాడు–నేడు పనులకు అత్యంత ప్రాధాన్యం



టెలికాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ మాధవీలత

సీటీఆర్ఐ (రాజమహేంద్రవరం): ప్రభుత్వ పాఠశాలల్లో జరుగుతున్న నాడు–నేడు పనులకు రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యమిచ్చి, వాటికి నిధులు విడుదల చేస్తోందని కలెక్టర్ మాధవీలత అన్నారు. నాడు – నేడు పనులు, ప్రాధాన్యత భవనాలపై బుధవారం కలెక్టరేట్ నుంచి మండల స్థాయి అధికారులతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని 654 పాఠశాలల్లో రూ.49.52 కోట్లతో చేపడుతున్న నాడు– నేడు పనులకు ప్రాధాన్యత ఇస్తూ పూర్తి చేయాలన్నారు. అదనపు తరగతి గదులు, మరుగుదొడ్లు, విద్యుత్, తాగునీటి సరఫరా, గ్రౌండ్ ఫ్లోర్, తదితర పెండింగ్ పనులను త్వరితగతిన చేపట్టాలన్నారు. ఆయా నిర్మాణాలకు అవసరమైన మెటీరియల్‌ను సిద్ధం చేసుకుని, మండల విద్యాధికారులు వ్యక్తిగత పర్యవేక్షణ బాధ్యతలను చేపట్టాలన్నారు. జిల్లా వ్యాప్తంగా 2,293 పనులకు సంబంధించి రూ.20.31 కోట్ల విలువైన పనులు పూర్తి కాగా, ఇప్పటి వరకూ 2,268 పనులకు చెందిన రూ.17.62 కోట్ల వివరాలు అప్లోడ్ చేశారన్నారు. మిగిలిన వాటి వివరాలు వెంటనే చేయాలని ఆదేశించారు. ప్రాధాన్యత భవనాలకు సంబంధించి ఆర్బీకే, సచివాలయం, హెల్త్ క్లినిక్ భవనాలను స్టేజ్ కన్వర్షన్‌కు అనుగుణంగా పూర్తి చేయడంతో పాటు ఆయా బిల్లులను ఎప్పటికప్పుడు అప్‌లోడ్ చేయాలని పీఆర్ ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. టెలికాన్ఫరెన్స్‌లో డీఈవో ఎస్.అబ్రహం, ఎస్ఈ పీఆర్ ఏబీవీ ప్రసాద్, ఆర్‌డబ్ల్యూఎస్‌ఈ ఎస్ఈ డి.బాల శంకరరావు పాల్గొన్నారు.

పాలనా వికేంద్రీకరణతో చేరువైన పథకాలు



లబ్ధిదారులకు పత్రాలను అందజేస్తున్న కలెక్టర్ మాధవీలత, ఎమ్మెల్యే తలారి వెంకట్రావు

గోపాలపురం: ప్రభుత్వం పరిపాలనా వికేంద్రీకరణ ద్వారా ప్రజలకు ఎంతో ప్రయోజనం చేకూరుస్తోందని కలెక్టర్ మాధవీలత పేర్కొన్నారు. స్థానిక సచివాలయం–3లో బుధవారం జగనన్న సురక్ష కార్యక్రమం జరిగింది. దీనికి ఎమ్మెల్యే తలారి వెంకట్రావు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గతంలో ప్రజలు ప్రభుత్వ సంబంధిత పనుల కోసం కార్యాలయాల వద్ద తిరిగేవారన్నారు, సచివాలయాలు.. వలంటీర్ల వ్యవస్థలు వచ్చాక ఆ అవస్థలు తప్పాయన్నారు. పేదల ఇంటికి ప్రభుత్వ సంక్షేమ పథకాల ఫలితాలు చేరుతున్నాయన్నారు. ఎమ్మెల్యే తలారి వెంకట్రావు మాట్లాడుతూ నవరత్నాలు కింద జగన్‌మోహన్‌రెడ్డి నూరుశాతం హామీలను అమలు చేశారన్నారు. జగనన్న సురక్ష ద్వారా 16 రకాల సేవలు ప్రజలకు అందుబాటులోకి తెచ్చారన్నారు. ఆదాయ, కుల, ఇంటిపట్టాలు, కౌలు రుణఅర్హత కార్డులు వంటివి ఎక్కడికక్కడే అందజేస్తున్నట్లు తెలిపారు. సచివాలయ పరిధిలో 1300 అర్జీలకు పరిష్కారం చూపించారన్నారు. 60మందికి వివిధ సర్టిఫికెట్లను కలెక్టర్ అందజేశారు. రాష్ట్ర అతిరాస కార్పొరేషన్ చైర్మన్ ఇళ్ల భాస్కరరావు, ఏఎంసీ చైర్మన్ గన్నమని జనార్దన్, ఎంపీపీ ఉండవల్లి సత్యనారాయణ, జెడ్పీటీసీ సభ్యురాలు కాకులపాటి లలిత, నాయకులు పోతిరెడ్డి నాగరాజు, కూసం రామమోహన్‌రెడ్డి, యండపల్లి కవిత, కప్పల వరలక్ష్మి, ఎస్‌కే వల్లీ, ముల్లంగి శ్రీనివాసరెడ్డి, అధికారులు పాల్గొన్నారు.

ఆలయాల అభివృద్ధికి సీఎం జగన్ కృషి

- డిప్యూటీ స్పీకర్ వీరభద్రస్వామి
- ఉమా మార్కండేయేశ్వరస్వామి పాలకమండలికి అభినందన సభ



అభినందన సభలో మాట్లాడుతున్న శాసనసభ డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి

సీటీఆర్ఐ (రాజమహేంద్రవరం): రాష్ట్రంలో ఆలయాల అభివృద్ధికి ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రత్యేక దృష్టి సారిస్తున్నారని, అలాగే ప్రభుత్వం నియమించిన పాలకమండలి సభ్యులు ఆలయాలకు వచ్చే భక్తులకు అన్ని వసతులు సమకూర్చడానికి చర్యలు తీసుకోవాలని ఏపీ శాసనసభ డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి అన్నారు. రాజమహేంద్రవరం గోదావరి గట్టున గల త్యాగరాజ కల్యాణ మండపంలో బుధవారం ఉమా మార్కండేయేశ్వరస్వామి ఆలయ నూతన పాలకమండలికి అభినందన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా వీరభద్రస్వామి మాట్లాడుతూ మార్కండేయేశ్వరస్వామి ఆలయ అభివృద్ధిని ఆర్యవైశ్య సామాజిక వర్గానికి చెందిన యిన్నమూరి ప్రదీప్ (దీపు) భుజస్కంధాలపై పెట్టడం దీపు పూర్వజన్మ సుకృతం అన్నారు.

త్వరలో శ్రీవారి ఆలయ నిర్మాణం

ఎంపీ మార్గాని భరత్ రామ్ మాట్లాడుతూ ఉభయ గోదావరి జిల్లాల్లో రాజమహేంద్రవరం నగరానికి ఓ ప్రత్యేకత ఉందన్నారు. గోదావరి గట్టున అనేక పవిత్ర, చారిత్రక ఆలయాలు ఉన్నాయని, వాటిలో మార్కండేయేశ్వరస్వామి ఆలయానికి దాదాపు వేయి సంవత్సరాల చరిత్ర ఉందన్నారు. నగరంలో గోదావరి గట్టున టీటీడీ ఆధ్వర్యంలో రూ.10 కోట్లతో శ్రీవారి ఆలయం నిర్మితం కాబోతోందని వెల్లడించారు. తాను టీటీడీకి రాసిన లేఖపై బోర్డు మీటింగ్‌లో ఈ మేరకు నిర్ణయం తీసుకోబోతున్నట్టు తెలిపారు. నగరంలోని పలు దేవాలయాలకు కమిటీలు వేసేందుకు ప్రతిపాదనలు పంపగా, మొట్టమొదటి అనుమతి మార్కండేయేశ్వరస్వామి ఆలయానికి వచ్చిందన్నారు. కోటిలింగాల ఆలయానికి కూడా కమిటీని నియమిస్తూ ఇప్పుడే ఉత్తర్వులు అందాయని, అరిగెల బాబు చైర్మన్‌గా త్వరలో ప్రమాణ స్వీకారం చేస్తారన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ సిటీ అధ్యక్షుడు అడపా శ్రీహరి, సిటీ కో ఆర్డినేటర్ గూడూరి శ్రీనివాస్, మాజీ ఎమ్మెల్యే రౌతు సూర్యప్రకాశరావు, ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు కాలుకూరి నాగబాబు, ఆర్యవైశ్య ప్రముఖులు శేషయ్య, ఆలయ పాలకమండలి చైర్మన్ ప్రదీప్, డైరెక్టర్లు ఎం.అవినాష్ గుబ్బ మణి, దాసరి శివప్రసాద్, వియ్యపు రాఘవేంద్ర యాదవ్, యరకల రజని, కేదారిశెట్టి వనిత, సాల సావిత్రి పాల్గొన్నారు.

పసలేని ఆరోపణలు.. ఆపై పలాయనం



విలేకరులతో మాట్లాడుతున్న పార్టీ మండల కన్వీనర్ సత్తి రామకృష్ణారెడ్డి



మాజీ ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డితో మాట్లాడుతున్న సీఐ శ్రీనివాస్

- రుజువు చేయలేక వెళ్లిపోయిన మాజీ ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి
- అనపర్తి ప్రాంతీయ ఆరోగ్య కేంద్రం వద్ద హైడ్రామా
- టీడీపీ నేతల కవ్వింపు చర్యలను తిప్పికొట్టిన వైఎస్సార్ సీపీ శ్రేణులు

అనపర్తి: ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డిపై అవినీతి ఆరోపణలు చేసి తీరా రుజువు చేయమని అడిగితే పలాయనం చిత్తగించిన మాజీ ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి వ్యవహార శైలి విమర్శల పాలైంది. స్థానిక ప్రాంతీయ ఆరోగ్య కేంద్రం అభివృద్ధికి సంబంధించి కోవిడ్ సమయంలో దాతల నుంచి సేకరించిన విరాళాల్లో అవినీతి చోటుచేసుకుందంటూ ఇటీవల మాజీ ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి ఆరోపణలు చేశారు. వాటిని ఆసుపత్రి అభివృద్ధి, నిర్వహణ, పర్యవేక్షణ కమిటీ సభ్యులు తిప్పికొట్టారు. ఆసుపత్రి అభివృద్ధిలో ఒక్క రూపాయి కూడా అవినీతి జరగలేదని, దీనిపై ఆధారాలు చూపేందుకు బుధవారం ఆసుపత్రిలో జరిగే ప్రత్యేక సమావేశానికి హాజరు కావాలని మాజీ ఎమ్మెల్యేకు సవాల్ విసిరారు. టీడీపీ శ్రేణులతో ఆసుపత్రిలోకి వస్తున్న మాజీ ఎమ్మెల్యేను.. శాంతిభద్రతల సమస్యలు తలెత్తుతాయన్న ఉద్దేశంతో సీఐ శ్రీనివాస్ ఆసుపత్రి గేటు వద్ద అడ్డుకున్నారు. దీంతో ఆసుపత్రి లోపల ఉన్న దాతలు, కమిటీ సభ్యులు గేటు వద్దకు చేరుకున్నారు. ఈ సమయంలో టీడీపీ శ్రేణులు ఎమ్మెల్యే వ్యతిరేకంగా నినాదాలు చేయడంతోపాటు కవ్వింపు చర్యలకు పాల్పడ్డారు. ఈ విషయం తెలియడంతో స్థానిక వైఎస్సార్ సీపీ శ్రేణులు ఆసుపత్రి వద్దకు చేరుకున్నాయి. దీంతో ఆసుపత్రి వద్ద కొంత ఉద్రిక్త వాతావరణ నెలకొంది. ఇరువర్గాలతో చర్చించిన సీఐ అధికార, ప్రతిపక్షాల నుంచి ఐదుగురు చొప్పున ఆసుపత్రిలో చర్చించేందుకు సిద్ధం కావాలని సూచించారు. దీనికి అధికార పార్టీ సభ్యులు అంగీకరించినప్పటికీ ప్రతిపక్షం నుంచి స్పందించలేదు. ఈ క్రమంలో కొంత సేపు హైడ్రామా తరువాత మాజీ ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి అక్కడ నుంచి వెళ్లిపోయారు. అనంతరం ఘటనా స్థలం వద్దకు చేరుకున్న రాజమహేంద్రవరం డీఎస్పీ ఎం.కిషోర్‌కుమార్ స్థానిక విలేకరులతో మాట్లాడుతూ శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా ఇరువర్గాలు కలవకుండా నిలువరించామని తెలిపారు.

రామకృష్ణారెడ్డి తోక ముడిచారు

ఆసుపత్రి అభివృద్ధి పర్యవేక్షణ కమిటీ విసిరిన సవాల్‌కు బదులివ్వలేకుండా మాజీ ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి తోకముడిచారని వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్, రాష్ట్ర రెడ్డి కార్పొరేషన్ డైరెక్టర్ సత్తి రామకృష్ణారెడ్డి ఎద్దేవా చేశారు. ఆసుపత్రి ఆవరణలో ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ నీతి, నిజాయితీలతో ప్రజలకు పారదర్శక పాలన అందిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సూర్యనారాయణరెడ్డిపై తప్పుడు ఆరోపణలు చేస్తే చూస్తూ ఊరుకోబోమన్నారు. ఏఎంసీ చైర్మన్ సబ్బెళ్ల కృష్ణారెడ్డి మాట్లాడుతూ మాజీ ఎమ్మెల్యే తాను వెంట తీసుకువచ్చిన మందీమార్బలంతో శాంతి భద్రతల సమస్యను సృష్టించేందుకు ప్రయత్నించారని ఆరోపించారు. దాతల నుంచి రూ.41 లక్షలు విరాళాలుగా వస్తే మాజీ ఎమ్మెల్యే రూ.1.50 కోట్ల అవినీతి జరిగిదంటూ ఆరోపణలు చేయడం హాస్యాస్పదంగా ఉందన్నారు.

ద్వారకా తిరుమలకు బస్సు సదుపాయం

ఏపీఎస్ ఆర్టీసీ ఈడీ గోపీనాథ్‌రెడ్డి



రాజమహేంద్రవరం డిపోలో రికార్డులు పరిశీలిస్తున్న ఈడీ గోపీనాథ్‌రెడ్డి

ప్రకాశం నగర్ (రాజమహేంద్రవరం): రాజమహేంద్రవరం బస్సు డిపో నుంచి ద్వారకా తిరుమలకు ప్రతి శని, ఆదివారాల్లో ప్రత్యేక బస్సు సర్వీసులు నడిపేందుకు చర్యలు తీసుకుంటున్నామని ఏపీఎస్ ఆర్టీసీ విజయవాడ జోన్ -2 ఈడీ గోపినాథ్ రెడ్డి తెలిపారు. ఆయన బుధవారం రాజమహేంద్రవరం బస్సు డిపోను తనిఖీ చేశారు. కార్యాలయంలోని రికార్డులను, బస్సు గ్యారేజ్‌ను పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ రాష్ట్రానికి త్వరలో మరో 1500 కొత్త బస్సులు రానున్నాయని, వాటిని జిల్లాల వారీగా ఆయా ప్రయాణికుల రద్దీని అనుసరించి కేటాయిస్తామన్నారు. టిక్కెట్ చెల్లింపులు విభాగంలో యూపీఐ పేమెంట్ పద్ధతిని త్వరలోనే తీసుకువస్తామని తెలిపారు. బస్సు డిపో ఆవరణలోని ఫుడ్‌స్టాళ్లు, ఇతర దుకాణాల్లో నిర్ణీత ధరలు కంటే అధికంగా విక్రయిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఇందుకోసం ఆయా స్టాళ్ల వద్ద ఒక ఫోన్‌నంబర్‌ను ఏర్పాటు చేస్తామన్నారు. ఆయన వెంట డీపీటీవోలు శ్రీనివాసరావు, షర్మిలా అశోకా, డీఎం షబ్నం పాల్గొన్నారు.

పంట కొనుగోలు పేరుతో రూ.15 లక్షలు టోకరా

గోకవరం: పంట కొనుగోలు పేరుతో రైతులకు రూ.15 లక్షలు టోకరా వేసిన ఘటనపై కేసు నమోదు చేసినట్టు స్థానిక ఎస్సై యువి శివ నాగబాబు బుధవారం తెలిపారు. వివరాల్లోకి వెళితే.. గోకవరం మండలంలోని పెంటపల్లి గ్రామానికి చెందిన కోలపర్తి వీరవెంకట్రావు సుమారు 20 ఎకరాల్లో మొక్కజొన్న పంట పండించగా అతనితో పాటు సుమారు 30 మంది రైతులు మొక్కజొన్న పంట వేశారు. ఈ పంటను కొవ్వూరుకు చెందిన దుద్దపూడి సూరిబాబు కొనుగోలు చేశాడు. ఈ క్రమంలో కొంత మంది రైతులకు కొద్ది మొత్తంలో నగదు మాత్రమే ఇచ్చి పంటను మొత్తం తీసుకున్నాడు. ఈ విధంగా 15 మంది రైతులకు సుమారు రూ.15 లక్షలు ఇవ్వకుండా మోసగించాడు. దీనిపై రైతులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

క్లుప్తంగా

ఎన్డీఏ కూటమిని గద్దె దించాలి

సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యురాలు వనజ



మాట్లాడుతున్న సీపీఐ నేత అక్కినేని వనజ

ప్రకాశంనగర్ : మతోన్మాదం కుల ప్రాంతీయ వాదాలతో దేశ ప్రజలను విభజించి పాలిస్తున్న ఎన్డీఏ కూటమిని గద్దె దించాలని, అధికార బీజేపీని ఓడించడమే లక్ష్యంగా ఏర్పడిన ప్రజాస్వామ్య కూటమి ఇండియాను ప్రతి ఒక్కరూ బలపరచాలని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యురాలు అక్కినేని వనజ పిలుపునిచ్చారు. బుధవారం స్థానిక సీపీఐ కార్యాలయంలో పార్టీ జిల్లా స్థాయి, శాఖ కార్యదర్శుల రెండు రోజుల వర్క్‌షాప్‌ను వనజ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాజ్యాంగాన్ని కాపాడేందుకు దేశంలో ఉన్న 28 రాజకీయ పార్టీలు ఏకమై ఇండియన్ నేషనల్ డెవలప్‌మెంటల్ ఇంక్లూజివ్ అలయన్స్ (ఇండియా)గా ఏర్పడ్డాయన్నారు. దేశంలో మహిళలు, దళితులు, గిరిజనులు కాశ్మీర్ పండితులపై పెరుగుతున్న నేరాలు, మైనార్టీలపై జరుగుతున్న దాడులను తిప్పికొట్టేందుకు ప్రతిపక్షాలన్నీ కలిశాయని తెలిపారు. కార్యక్రమానికి జిల్లా కార్యదర్శి తాటిపాక మధు అధ్యక్షత వహించగా, సహాయ కార్యదర్శి రేఖ భాస్కర్‌రావు, నగర కార్యదర్శి కొండలరావు పాల్గొన్నారు.

బాలికపై లైంగిక దాడి యత్నం కేసులో ఐదేళ్ల జైలు

అమలాపురం రూరల్: ఓ బాలికపై లైంగిక దాడికి యత్నించిన అభియోగం రుజువు కావడంతో అమలాపురం రూరల్ మండలం తాండవపల్లికి చెందిన గుత్తాల సువర్ణరాజుకు ఐదేళ్ల కఠిన కారాగార శిక్ష విధిస్తూ కాకినాడ పోక్సో చట్టం కేసుల ప్రత్యేక జిల్లా కోర్టు న్యాయమూర్తి ఎల్.వెంకటేశ్వరరావు బుధవారం తీర్పుచెప్పారు. ఈ కేసు వివరాలను అమలాపురం డీఎస్పీ ఎం.అంబికా ప్రసాద్ ప్రకటనలో వివరించారు. అమలాపురం తాలూకా పోలీసు స్టేషన్ పరిధిలోని తాండవపల్లిలో 2022 మే ఒకటో తేదీన ఎనిమిదేళ్ల బాలికపై అదే గ్రామానికి చెందిన 40 ఏళ్ల గుత్తాల సువర్ణరాజు లైంగిక దాడికి యత్నించాడన్నది అభియోగం. అప్పట్లో బాలిక అమ్మమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు అమలాపురం తాలూకా పోలీసు స్టేషన్‌లో నిందితుడిపై కేసు నమోదైంది. కాకినాడ కోర్టులో బుధవారం జరిగిన తుది విచారణలో నేరం రుజువు కావడంతో పై విధంగా శిక్ష విధించారు. జైలు శిక్షతో పాటు రూ.500 జరిమానా విధించారు. ప్రాసిక్యూషన్ తరఫున స్పెషల్ పీపీ పి.శ్రీనివాసరావు వాదించారు. దర్యాప్తు చేసిన సీఐ వీరబాబు, ఎస్సై పరదేశి, హెచ్‌సీ కె.సుబ్రహ్మణ్యాన్ని ఎస్పీ శ్రీధర్ అభినందించారు.

నైపుణ్యాభివృద్ధికి తర్ఫీదు

- విద్యార్థుల సామర్థ్యం పెంచే దిశగా రాష్ట్ర ప్రభుత్వం అడుగులు
- తొలిదశ తూర్పు, కాకినాడ, కోనసీమ జిల్లాల్లోని 150 పాఠశాలల్లో అమలు
- 300 మంది వ్యాయామోపాధ్యాయులు, ఉపాధ్యాయులకు శిక్షణ పూర్తి


డైట్‌లో జీవన నైపుణ్యాల శిక్షణ కార్యక్రమంలో పాల్గొన్న కాకినాడ జిల్లా వ్యాయామోపాధ్యాయులు, ఉపాధ్యాయులు

రాజమహేంద్రవరం రూరల్/రాయవరం: సమస్య ఏదైనా, ఎంతటి విషమ పరిస్థితి ఎదురైనా స్థిరంగా ఆలోచించి, సొంతంగా ఓ మంచి నిర్ణయాన్ని తీసుకుని ధైర్యంగా అమలు చేసే సామర్థ్యం ప్రతి ఒక్కరిలో ఉండాలి. అలాంటి జీవన నైపుణ్యాలను ప్రాథమిక దశ నుంచే విద్యార్థులు నేర్చుకుంటే వారు సామాజిక బాధ్యత నెరిగి సంఘంలో ఉత్తమ పౌరులుగా ఉన్నత స్థాయికి ఎదుగుతారు. ఈ ఆలోచనతోనే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నవీన విద్యావిధానంలో జీవన నైపుణ్యాల శిక్షణను పాఠ్యాంశాలుగా చేర్చాలని ఓ చారిత్రక నిర్ణయం తీసుకున్నారు. పాఠశాల విద్యాశాఖ ఆధ్వర్యంలో ఈ విద్యాసంవత్సరం నుంచే దీనిని అమలు చేసేందుకు చర్యలు తీసుకున్నారు. ఇందు కోసం అంతర్జాతీయ స్వచ్ఛంద సంస్థ ‘మ్యాజిక్ బస్ ఇండియా ఫౌండేషన్’తో ఒప్పందం చేసుకుంది. ఈ సంస్థ పేద కుటుంబాలకు చెందిన పిల్లలు అత్యధికంగా ఉండే ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు మూడేళ్లపాటు జీవన నైపుణ్యాలు, జీవనోపాదులపై తర్ఫీదు ఇవ్వనుంది.

శిక్షణ ఇలా...

తూర్పుగోదావరి, కాకినాడ, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాల్లో ఒక్కొక్క జిల్లాలో 300 మంది విద్యార్థులున్న 50 ఉన్నత పాఠశాలలను జీవన నైపుణ్యాల శిక్షణకు ఎంపిక చేశారు. ఆయా పాఠశాలల నుంచి పీడీ/పీఈటీతో పాటు ఒక యాక్టివ్ టీచర్‌ను ఎంపిక చేసి మూడురోజుల పాటు బొమ్మూరులోని ప్రభుత్వ జిల్లా విద్యాశిక్షణ సంస్థ(డైట్)లో శిక్షణ ఇచ్చారు. శిక్షణ పొందిన ఉపాధ్యాయులు తమ పాఠశాలల్లోని 6,7,8 తరగతుల విద్యార్థులకు నేర్పిస్తారు. పాఠశాల టైంటేబుల్‌లో ఏడాదిలో 28 పిరియడ్‌ల చొప్పున జీవన నైపుణ్యాల శిక్షణ తరగతులను కేటాయిస్తారు. ఈ శిక్షణలో ప్రధానంగా జ్ఞానాత్మకం, భావాత్మకం, సాంఘిక విషయాలు వంటి 11రకాల జీవన నైపుణ్యాలపై సమగ్ర అవగాహన కల్పిస్తారు.

తొలి విడతగా..

బొమ్మూరులోని డైట్ కళాశాలలో వారం రోజుల నుంచి శిక్షణ ఇస్తున్నారు. ముందుగా తూర్పుగోదావరి జిల్లాలోని 50 పాఠశాలల వ్యాయామోపాధ్యాయులకు, ఉపాధ్యాయులు 100 మందికి, రెండవ విడతలో కాకినాడ జిల్లా, అంబేద్కర్ కోనసీమ జిల్లా వ్యాయామోపాధ్యాయులు, ఉపాధ్యాయులు 50 పాఠశాలల చొప్పున 200 మందికి శిక్షణ ఇచ్చారు. ఎస్‌సీఈఆర్టీ సౌజన్యంతో మ్యాజిక్ బస్ సంస్థ జాతీయ, రాష్ట్ర ప్రతినిధులు, డైట్ అధ్యాపకులు ఒక్కో జిల్లాకు మూడు రోజుల చొప్పున శిక్షణ తరగతులను నిర్వహించారు.

సంస్థ ద్వారా 2లక్షల మందికి శిక్షణ ఇచ్చాం



1999లో ఢిల్లీలో స్థాపితమైన మ్యాజిక్ బస్ ఇండియా ఫౌండేషన్ ద్వారా పలు రాష్ట్రాల్లో ఇప్పటికే రెండు లక్షల మంది విద్యార్థులకు జీవన నైపుణ్యాలు, ఒకేషనల్ కోర్సులపై శిక్షణ ఇచ్చాం. రాష్ట్ర ప్రభుత్వం పేదల జీవన ప్రమాణాలను పెంచాలనే ఉద్దేశంతో వారి పిల్లలకు ప్రాథమిక విద్య నుంచే వీటిపై శిక్షణ ఇవ్వాలని కోరింది. జాతీయ నవీన విద్యావిధానం ద్వారా భవిష్యత్తులో దీనిని కరిక్యులంగా చేయనుంది. ప్రతి మనిషికి కొన్ని జీవన నైపుణ్యాలు అవసరం..ఆట,పాటల ద్వారా విద్యార్థులను జీవన నైపుణ్యాలను నేర్పిస్తారు.

–దేవిడ్ రేవంత్, సీనియర్ ట్రైనింగ్ మేనేజర్, మ్యాజిక్ బస్ ఇండియా ఫౌండేషన్

300 మంది వ్యాయామోపాధ్యాయులు, ఉపాధ్యాయులకు..



ఉపాధ్యాయులకు జీవన నైపుణ్యాలపై లోతుగా అవగాహన కల్పించాం. ఇవన్నీ విద్యార్థి భావిజీవితానికి ఎంతో దోహదపడతాయి. మనసులోని చెడు ఆలోచన్లను తుడిచేసి పాజిటివ్ దృక్పథం వైపు పిల్లల్ని నడిపిస్తాయి. ప్రస్తుత కాలంలో ఇలాంటి శిక్షణ పిల్లలకు, వారి తల్లిదండ్రులకు ఎంతో అవసరం.

–డాక్టర్ ఎస్‌డీవీ రమణ, ప్రిన్సిపాల్, డైట్, బొమ్మూరు

సీఎం నిర్ణయం అభినందనీయం



ఒక పిల్లవాడిని చిన్ననాటి నుంచే ఎలా ఉన్నతంగా తీర్చిదిద్దాలో ఈ జీవన నైపుణ్యాలు నేర్పుతాయి. బోధనరంగంలో మా సర్వీసులో ఇంతటి గొప్ప నైపుణ్యాలను పెంపొందించే ప్రభుత్వాన్ని చూడలేదు. రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న ఈ గొప్ప నిర్ణయం విద్యార్థుల జీవితాల్లో గొప్ప మలుపులకు కారణమవుతుంది. ఉత్తమ పౌరులను సమాజానికి అందించేందుకు ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి చేస్తున్న కృషి అభినందనీయం.

– గారపాటి శ్రీదేవి, ఫిజికల్ డైరెక్టర్, జెడ్పీహెచ్‌ఎస్, అమలాపురం

ఆరోగ్య కార్యక్రమాలపై కేంద్ర బృందం పరిశీలన

ప్రోగ్రాం ఆఫీసర్స్ సమావేశంలో అందిస్తున్న సేవలను వివరించిన జిల్లా అధికారులు


కేంద్ర అధికారులతో మాట్లాడుతున్న డీఎంఅండ్‌హెచ్‌వో డాక్టర్ వెంకటేశ్వరరావు

రాజమహేంద్రవరం రూరల్: వైద్య, కుటుంబ సంక్షేమ మంత్రిత్వ శాఖ భారత ప్రభుత్వం తరఫు నుంచి పాపులేషన్ రీసెర్చ్ సెంటర్ మోనిటరింగ్ ఆఫీసర్స్ బుధవారం జిల్లా పర్యటించారు. ఇక్కడ అమలవుతున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆరోగ్య కార్యక్రమాలపై పరిశీలన నిర్వహించారు. అనంతరం బొమ్మూరులోని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి కార్యాలయంలో మానిటరింగ్ ఆఫీసర్స్ డాక్టర్ రాజేష్, జే.నాయర్, డాక్టర్ ఎంసి మాథ్యూస్ జిల్లాలో ప్రోగ్రాం ఆఫీసర్స్ సమావేశంలో పాల్గొన్నారు. జిల్లాలో అమలువుతున్న ఆరోగ్య కార్యక్రమాల పనితీరును అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ కె.వెంకటేశ్వరరావు కేంద్ర ప్రభుత్వం, రాష్ట్ర ప్రభుత్వం అందించే జాతీయ ఆరోగ్య కార్యక్రమాలను అన్నింటిని పాపులేషన్ రీసెర్చ్ సెంటర్ బృందానికి తెలియజేశారు. జిల్లా లెప్రసి అండ్ క్షయ అధికారి డాక్టర్ ఎస్.వసుంధర, పాపులేషన్ రీసెర్చ్ సెంటర్ టీం వారికి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా జిల్లాలో అమలవుతున్న ఆరోగ్య కార్యక్రమాలను తెలియచేశారు. జాతీయ ఆరోగ్య కార్యక్రమాలు రాష్ట్ర ప్రభుత్వ ద్వారా అమలు తీరును, వైద్యసేవలు, ఫ్యామిలీ ఫిజిషన్ కాన్సెప్ట్ ద్వారా రాష్ట్రంలో నూతనంగా ఏర్పాటు చేసిన సచివాలయంలో ఉన్న వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్స్‌లో అందించే ఆరోగ్య సేవలు తెలియపరిచారు. జిల్లా కలెక్టర్ డాక్టర్ కె.మాధవీలత దిశా నిర్దేశంలో ప్రజల స్వచ్ఛంద భాగస్వామ్యంతో నూతనంగా ఏర్పాటు చేసిన బంగారుకొండ కార్యక్రమంలో భాగంగా పౌష్టికాహార లోపం, బరువు తక్కువ ఉన్న పిల్లలను గుర్తించి బాలమిత్రాల ద్వారా వారం వారం వారి ఎత్తు బరువులను పరిశీలించి తగిన వైద్య సదుపాయాలు పోషణ అందించే ప్రయత్నం చేస్తున్నారని, దీని ద్వారా మంచి ఫలితాలు వస్తున్నాయని తెలియజేశారు. డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ వరలక్ష్మి మాట్లాడుతూ ఫ్యామిలీ ఫిజీషియన్ కాన్సెప్ట్‌లో అందిస్తున్న ఆరోగ్య సేవలను, ఇంటి వద్ద ఉన్న బెడ్ రిడెన్ కేసులకు అందించే సేవలను కేంద్ర బృందానికి వివరించారు. జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ రాజకుమారి మాట్లాడుతూ ప్రధానమంత్రి మాతృత్వ వందన యోజన కార్యక్రమాల ద్వారా అమలవుతున్న సేవలను తెలియజేశారు. డాక్టర్ రాజీవ్ మాట్లాడుతూ రాష్ట్రీయ బాల స్వస్థ కార్యక్రమం ద్వారా అమలయ్యే డైరెక్టలీ ఎర్లీ ఇంట్రవెన్షన్ సెంటర్ వివరాలు తెలిపారు. డాక్టర్ అభిషేక్ మాట్లాడుతూ మిడ్ లెవెల్ హెల్త్ ప్రొవైడర్, ఆశ, ఏఎన్ఎం పనితీరును సచివాలయంలో జరుగుతున్న వైద్య సేవలను వివరించారు. ఈ సందర్భంగా జనాభా రీసెర్చ్ సెంటర్ నోడల్ ఆఫీసర్స్ మాట్లాడుతూ జిల్లాలో జాతీయ ఆరోగ్య కార్యక్రమాలు.. లబ్ధిదారులకు అందే ప్రక్రియలో ఎక్కడైనా లోపాలు ఉన్నాయా అనే అంశాలపై పరిశీలిస్తున్నామన్నారు. మూడు రోజులు జిల్లాలో ఉన్న ఏరియా ఆస్పత్రులు, కమ్యూనిటీ హెల్త్ సెంటర్స్, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, పాఠశాలలు, అంగన్వాడీ సెంటర్లు పరిశీలించి ప్రజలకు అందచేస్తున్న వైద్య సేవలపై కేంద్ర ప్రభుత్వానికి నివేదిక సమర్పిస్తామన్నారు. డాక్టర్ లక్ష్మీదేవి, డాక్టర్ రవికుమార్, ఇతర వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

గుండెపోటుతో ఉపాధి కూలీ మృతి


సావిత్రి (ఫైల్)

మామిడికుదురు: అప్పనపల్లిలో ఉపాధి హామీ పథకం పనులు చేస్తూ అదే గ్రామానికి చెందిన శేరు సావిత్రి (55) బుధవారం మృతి చెందింది. ఉదయం తోటి కూలీలతో కలసి గ్రామంలో కొబ్బరిచెట్ల చుట్టూ పళ్లాలు తవ్వుతూ సావిత్రి ఒక్కసారిగా కుప్పకూలిపోయిందని ఉపాధి హామీ పథకం ఏపీఓ మేడిది సీతారామ్ తెలిపారు. ఆమెను ఆస్పత్రికి తీసుకువెళ్లేందుకు ప్రయత్నించగా అప్పటికే సావిత్రి చనిపోయిందన్నారు. ఆమె మృతదేహాన్ని ఇంటికి తీసుకువెళ్లారు. తమతో రోజూ కలిసి పనిచేసే ఉపాధి కూలీ మృతి చెందడంతో సహచర కూలీలు కన్నీటి పర్యంతమయ్యారు. స్థానిక సర్పంచ్ గెడ్డం మంగాలక్ష్మి, గెడ్డం వెంకటేశ్వరరావు సావిత్రి మృతదేహాన్ని పరిశీలించి నివాళులర్పించారు.

హత్య కేసులో ఆధారాల కోసం గాలింపు


గ్రామస్తులతో మాట్లాడుతున్న తుని రూరల్, ప్రత్తిపాడు సీఐలు సన్యాసిరావు, కిషోర్‌బాబు

తుని రూరల్: కాకినాడ జిల్లా తుని మండలం తేటగుంట శివారు ఎర్రకోనేరులో మహిళ హత్య, ఆటో డ్రైవర్‌పై హత్యాయత్నం చేసిన దుండగుల ఆచూకీ, ఆధారాల కోసం గ్రామస్తులతో కలసి పోలీసులు గాలింపు నిర్వహించారు. బుధవారం పెద్దాపురం డీఎస్పీ లతాకుమారి ఆధ్వర్యంలో తుని రూరల్, ప్రత్తిపాడు సీఐలు ఎ.సన్యాసిరావు, కిషోర్‌బాబు గ్రామస్తులతో మాట్లాడారు. బాధిత కుటుంబం నుంచి దొంగిలించిన ఫోన్, అనుమానిత పరికరాలు, ఆయుధాలు, తదితరాలు గుర్తిస్తే నేరుగా పట్టుకోకుండా అక్కడ తెల్లరంగు జెండాను ఉంచాలని సూచించారు. గ్రామస్తులకు పోలీసులు తెల్ల రంగు జెండాలను పంపిణీ చేశారు. అనంతరం సామూహికంగా హత్య జరిగిన సమీప ప్రాంత తోటల్లో గాలించారు. ఫోన్, ఇతర అనుమానిత పరికరాలు, ఆయుధాలు లభించలేదని రూరల్ సీఐ సన్యాసిరావు తెలిపారు. ఇద్దరు ఎస్సైల ఆధ్వర్యంలో బిహార్ వెళ్లిన ఆరుగురు పోలీసులు ఇద్దరేసి చొప్పున బృందాలుగా విడిపోయి దర్యాప్తు చేస్తున్నారు. మరో నాలుగు ప్రత్యేక బృందాలు జిల్లాలో విచారణ చేస్తున్నాయి.

తాళం వేసిన ఇంట్లో చోరీ

రూ.3.4 లక్షల నగదు, 15 కాసుల బంగారు నగల అపహరణ


చోరీ జరిగిన ఇంటిని పరిశీలిస్తున్న సీఐ ప్రశాంత్‌కుమార్, ఎస్సై హరికోటి శాస్త్రి

పి.గన్నవరం: స్థానిక డీఎస్ పాలెంలో తాళం వేసిన ఇంట్లో మంగళవారం రాత్రి చోరీ జరిగింది. రూ.3.4 లక్షల నగదు, 15 కాసుల బంగారు ఆభరణాలు చోరీకి గురయ్యాయని బాధితుడు రామేశ్వరపు శ్రీను పోలీసులకు ఫిర్యాదు చేశాడు. బుధవారం ఉదయం సీఐ ప్రశాంత్‌కుమార్, ఎస్సై హరికోటి శాస్త్రి చోరీ జరిగిన ఇంటిని పరిశీలించారు. క్లూస్ టీమ్ సభ్యులు వేలిముద్రలు సేకరించారు. ఆటో డ్రైవర్‌గా పనిచేస్తున్న శ్రీను డీఎస్ పాలెంలోని అద్దె ఇంట్లో నివసిస్తున్నాడు. అతడు మరొక ప్రాంతంలో కొత్తగా ఇంటిని నిర్మిస్తున్నాడు. ఈ క్రమంలో ఇంటి నిర్మాణం కోసం తెచ్చిన రూ.3 లక్షలతో పాటు, భార్య వెంకటలక్ష్మికి చెందిన 15 కాసుల బంగారు నగలను చెక్క డ్రాయర్‌లో పెట్టి తాళం వేసి, తాళం చెవిని ఇంట్లో భద్రపరిచాడు. ఉప్పు డబ్బాలో రూ.40 వేలు దాచాడు. కొత్త ఇంటికి అవసరమైన టైల్స్ కొనుగోలు కోసం మంగళవారం సాయంత్రం శ్రీను తన భార్య, కుమారుడు, కోడలితో కలిసి రావులపాలెం వెళ్లాడు. తిరిగి రాత్రి 9 గంటలకు డీఎస్ పాలెంలోని ఇంటికి వచ్చారు. ఇంటి తలుపునకు ఉన్న సెంట్రల్ లాక్ తెరుచుకోక పోవడంతో వెనక్కి వెళ్లే సరికి ఆ తలుపులు తెరచిఉన్నాయి. దొంగలు వీధి తలుపును మారుతాళంతో తీసి లోపలికి వెళ్లి, డ్రాయర్‌లోని నగదు, బంగారు ఆభరణాలను, ఉప్పు డబ్బాలోని నగదును తస్కరించినట్టు బాధితులు గుర్తించారు. సీఐ ప్రశాంత్‌కుమార్ బాధితులతో మాట్లాడారు. వారం రోజుల క్రితం వీధి తలుపు తాళం చెవి కనిపించలేదని, రెండు రోజుల తర్వాత అదే తాళం సింక్‌లో పడి ఉందని బాధితుడు తెలిపాడు. దీంతో తెలిసిన వారెవరైనా చోరీకి పాల్పడ్డారా అనే అనుమానం పోలీసులు వ్యక్తం చేస్తున్నారు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై హరికోటి ప్రసాద్ తెలిపారు.

రూ.80 వేల విలువ చేసే ఆభరణాల దోపిడీ

కరప: ఒక ఇంటిలోకి ముసుగు దొంగలు చొరబడి, మహిళను కట్టేసి, రూ.80 వేలు విలువచేసే బంగారు ఆభరణాలు దోచుకెళ్లిపోయిన ఘటన మంగళవారం రాత్రి కరప మండలం నడకుదురులో జరిగింది. కరప పోలీసుస్టేషన్ రైటర్ శ్రీను తెలిపిన వివరాల మేరకు... నడకుదురులోని బృందావనకాలనీకి చెందిన ఉరితి వెంకయ్యమ్మ ఆదేకాలనీలో తనకు తెలిసిన గాడి వినోద్ ఇంటి వద్ద వంటమనిషిగా పనిచేస్తోంది. వినోద్ తన భార్యాపిల్లలు, తల్లితో కలసి మంగళవారం రాత్రి 10 గంటల సమయంలో వైద్యం కోసం కాకినాడ ఆసుపత్రికెళ్లారు. వెంకయ్యమ్మ తలుపులు వేసుకుని నిద్రించింది. అర్ధరాత్రి సమయంలో ఇద్దరు ముసుగు దొంగలు ఇంటివెనుక ఉండే గుమ్మం తలుపుల బోల్టుల తప్పించి ఇంటిలోకి చొరబడ్డారు. ముసుగుదొంగలు ఆ మహిళ చేతులు కట్టేసి, రూ.80 వేలు విలువచేసే నాలుగు బంగారు గాజులు, రెండు చెవిదుద్దులు బలవంతంగా లాక్కుని పరారయ్యారు. బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు బుధవారం కరప పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ మేరకు కరప ఎస్ఐ ఎన్.రామకృష్ణ కేసు దర్యాప్తు చేస్తున్నారు.